**Sakshi**

# అక్టోబర్‌లో ఎస్సై, కానిస్టేబుల్ తుది పరీక్షలు!

- రెండు రోజుల్లో తేదీలను ప్రకటించనున్న పీఆర్‌బీ
- మొదట కానిస్టేబుల్, తర్వాత ఎస్సై పరీక్షల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్సై), కానిస్టేబుల్ పోస్టులకు తుది రాత పరీక్షలకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (పీఆర్‌బీ) సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రిలిమినరీ, దేహ దారుఢ్య పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో... ఉన్నతాధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే అక్టోబర్ చివరి వారంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెండు రోజుల్లోనే తేదీలను అధికారికంగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో తొలుత కానిస్టేబుల్ పరీక్షను, తర్వాత ఎస్సై పోస్టుల పరీక్షలను నిర్వహించనుంది.

**ఒక్కో పోస్టుకు 9 మంది పోటీ**

తుది పరీక్షల్లో ఒక్కో కానిస్టేబుల్ పోస్టుకు దాదాపు 9 మంది పోటీపడనున్నారు. వివిధ విభాగాల్లో కలిపి మొత్తంగా 9,613 కానిస్టేబుల్ పోస్టులు ఉండగా.. వాటికి దాదాపు 5.36 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1.92 లక్షల మంది ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించారు. దేహ దారుఢ్య పరీక్షల అనంతరం తుది రాతపరీక్షకు 81 వేల మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు.

**ఎస్సై పోస్టులకు భారీగా పోటీ..**

ఎస్సై పోస్టులకు పోటీ చాలా ఎక్కువగా ఉంది. మొత్తంగా వివిధ విభాగాల్లోని 539 ఎస్సై పోస్టులను భర్తీ చేయనుండగా... 2.23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమినరీ రాతపరీక్షలో 91 వేల మంది అర్హత సాధించారు. అందులో దేహ దారుఢ్య పరీక్షలకు 75 వేల మంది హాజరుకాగా.. 32,457 మంది అర్హత సాధించారు. అంటే ఒక్కో పోస్టుకు సగటున 60 మంది పోటీ పడుతున్నారు.